క్లుప్తంగా

త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ

ప్యాపిలి: త్రైత సిద్ధాంత తెలుగు సంవత్సరాది క్యాలెండర్లను గురువారం పలువురు అధికారులు ఆవిష్కరించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటరామిరెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మధుసూదన్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ తదితరులు క్యాలెండర్లను ఆవిష్కరించారు. తెలుగు పండుగల విశిష్టత, తెలుగు నెలల విశిష్టతను తెలియజేస్తూ క్యాలెండర్లు రూపొందించారని తెలిపారు. త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు కేశవులు, వెంకటరమణ, హరికృష్ణ పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర కిట్లు పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న సేవా సంస్థ సభ్యులు

డోన్ టౌన్: దాతల ఆర్థిక సహకారంతో స్ఫూర్తి సేవా సంస్థ సభ్యులు నిరుపేద కుటుంబాలకు ఉగాది, రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. గురువారం పట్టణంలోని పలువురు నిరుపేదలకు కిట్లు అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు మధు, నారాయణస్వామి, భాస్కర్, అంజి, వసంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

అన్నదానం



అన్నం వడ్డిస్తున్న చరణ్ అభిమానులు

డోన్ టౌన్: సినీ నటుడు రామ్ చరణ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు గురువారం డోన్ పాత బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అభిమానులు బ్రహ్మం, గణేష్, జయచంద్ర, శివాజీ, పుల్లయ్య, ఆర్య, రంగారెడ్డి ఉన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న సభ్యులు

డోన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాస్పత్రి ఆవరణలో 70 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని బుధవారం రాత్రి పోలీసులు గుర్తించారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, ఆస్పత్రి సూపరింటెండెంట్ హనీఫ్ కోరిక మేరకు ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు స్థానిక శ్మశానవాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. వైకుంఠ రథాన్ని రోటరీ క్లబ్ సభ్యుడు రాజయ్యగౌడ్ సమకూర్చగా, అంత్యక్రియల ఖర్చును చంద్రశేఖర్ భరించారు. పోలీసులు కాశీంవలి, రామాంజి, సేవాసమితి సభ్యులు తాహెర్‌బాషా, గురుస్వామి, సయ్యద్‌వలి పాల్గొన్నారు.

మినీవ్యాన్‌లకు జరిమానా



ఆర్టీసీ డిపోలో ఉన్న మినీ వ్యాన్

డోన్ రూరల్: కర్ణాటక రాష్ట్రానికి చెందిన రెండు మినీ వ్యాన్‌లకు జరిమానా విధించినట్లు ఆర్టీఓ క్రాంతికుమార్ తెలిపారు. గురువారం పట్టణంలో వాహనాల తనిఖీ చేశారు. కర్ణాటక రాష్ట్రం నుంచి శ్రీశైలం వెళ్తున్న రెండు మినీ వ్యాన్‌లను పరిశీలించగా ఎలాంటి రోడ్ ట్యాక్స్, పర్మిట్ లేదని గుర్తించారు. కేసు నమోదు చేసి, రూ.38 వేలు జరిమానా విధించారు. వ్యాన్‌లను డోన్ ఆర్టీసీ డిపోకు తరలించారు. రాష్ట్రానికి కట్టాల్సిన రోడ్డు ట్యాక్స్ చెల్లించకుంటే వాహనాలు సీజ్ చేస్తామని ఆర్టీఓ హెచ్చరించారు.

జవహర్ నవోదయకు విద్యార్థి ఎంపిక



ప్రజ్వల్

ప్యాపిలి: పట్టణానికి చెందిన రామకృష్ణయ్య, సరిత కుమారుడు ప్రజ్వల్ జవహర్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. జనవరిలో నవోదయ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. స్థానిక శివజ్యోతి విద్యానికేతన్‌లో ఐదో తరగతి చదువుతున్న ప్రజ్వల్ ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికయ్యాడు. రెండు రోజుల క్రితం వెలువడిన మెరిట్‌లిస్టులో ప్రజ్వల్‌కు బనవాసిలో సీటు వచ్చినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

వైద్యం.. నిర్లక్ష్యం

- ఆసుపత్రులను వేధిస్తున్న డాక్టర్లు, సిబ్బంది కొరత
- పలు విభాగాల్లో పరికరాల లేమి
- వైద్యరంగాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- రోగులకు తప్పని తిప్పలు



బనగానపల్లె ఏరియా ఆసుపత్రిలో ఓపీ రిజిస్ట్రేషన్‌కు పడిగాపులు కాస్తున్న రోగులు

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య రంగాన్ని విస్మరించి పేద ప్రజలకు వైద్యాన్ని దూరం చేస్తోంది. చాలా ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు లేవు. వైద్యులు, పరికరాల కొరత వేధిస్తోంది. కనీసం రోగులు కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు కూడా లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. బనగానపల్లె నియోజకవర్గంలో ఒక ఏరియా ఆసుపత్రి, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలందిస్తున్నారు. ఇందులో పలు ఆసుపత్రులను డాక్టర్లు, వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. కంటి, ఎముకలు, గుండె, తదితర ప్రధాన విభాగాలకు సంబంధించి ఎలాంటి పరికరాలు లేకపోవడంతో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందక ప్రజలు మెరుగైన వైద్యం కోసం కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, అనంతపురం జిల్లా తాడిపత్రి వంటి పట్టణాలకు పరుగులు తీస్తున్నారు.

గత ప్రభుత్వం ఇలా

గత వైఎస్సార్‌సీపీ సర్కార్ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ వైద్య రంగానికి పెద్ద పీట వేసింది. నాడు– నేడు కార్యక్రమం ద్వారా ఆసుపత్రుల రూపురేఖలు మార్చి వేసింది. గ్రామాల్లో ఉండే ఆరోగ్య ఉపకేంద్రాలు మొదలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లాస్థాయి ఆసుపత్రుల్లో పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని సౌకర్యాలు కల్పించింది. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి ఆసుపత్రుల్లో ఉచిత వైద్యసేవలు అందించింది.

వేధిస్తున్న డాక్టర్లు, పరికాల కొరత

బనగానపల్లె ఏరియా ఆసుపత్రిలో ఆరు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ఒక డీఎస్ఆర్, ఏడు స్టాఫ్‌నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆర్థో, కంటి, ఈఎన్‌టీ విభాగాలను పరికాల కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో గుండె వ్యాధికి సంబంధించి డాక్టర్లు లేరు. బనగానపల్లె మండలంతోపాటు కోవెలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల మండలాలకు చెందిన రోగులు ఆసుపత్రికి వస్తున్నారు. ప్రతి రోజు 350 నుంచి 400 వరకు ఓపీ నమోదవుతోంది. రోగులు భారీగా వస్తున్నా ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో డాక్టర్లు లేకపోవడంతో ఉన్న డాక్టర్లే వైద్య సేవలందించాల్సి వస్తోంది. గుండె వ్యాధినిపుణుడు లేకపోవడంతో నంద్యాల, కర్నూలుకు వెళ్లాల్సిన పరిస్థితి. ఎముకలు, కంటి, ముక్కు, చెవి, గొంతు జబ్బులకు సంబంధించి ఆసుపత్రిలో పరికరాలు లేకపోవడంతో రోగులను పరీక్షించేందుకు అవకాశం లేకుండా పోయింది. ఓపీ నమోదు చేసుకునేందుకు ఆధార్, సెల్‌నంబర్, ఓటీపీ, తదితర ఆంక్షలు విధించడంతో ఓపీ కేంద్రం వద్ద రోగులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. రోగులకు కుర్చీలు కూడా లేకపోవడంతో గంటల తరబడి నిలబడి ఉండాల్సి వస్తోంది. ఏరియా స్థాయి ఆసుపత్రి అయినప్పటికీ మంచినీటి పథకం లేక తాగునీటి కోసం వాటర్ క్యాన్లు ఏర్పాటు చేశారు. వేసవికాలం కావడంతో తాగునీటి కష్టాలు తప్పడం లేదు.

ఎక్సరే పరికరం లేక ఇక్కట్లు

కోవెలకుంట్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నేషనల్ హెల్త్ మిషన్‌కు సంబంధించి రెండు స్టాఫ్‌నర్స్, సీహెచ్‌సీలో ఒక స్టాఫ్ నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఎక్సరే పరికరం లేకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. దీని వల్ల రోగులకు ఆర్థిక భారం పడుతోంది.

బనగానపల్లె నియోజకవర్గంలో ఆసుపత్రుల వివరాలు:	
ఏరియా ఆసుపత్రి	01
కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు	02
ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు	10

సంజామల పీహెచ్‌సీలో అంతంత మాత్రమే

సంజామల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సిబ్బంది కొరత వేధిస్తోంది. ఒక డాక్టర్లు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఎంపీహెచ్ఎస్, సీనియర్ అసిస్టెంట్, ఎఫ్ఎన్ఓ, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒకే డాక్టర్ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలందించాల్సి వస్తోంది.



రోగులకు కూర్చునేందుకు కుర్చీలు లేక వేచి ఉన్న రోగులు

అద్దె భవనంలో పీహెచ్‌సీ



అద్దె భవనంలో కొనసాగుతున్న అంకిరెడ్డిపల్లె పీహెచ్‌సీ

కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లెలో పీహెచ్‌సీని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామానికి కొత్త పీహెచ్‌సీ కోసం నిధులు మంజూరు చేసింది. ఈ ప్రభుత్వ హయాంలోనే తుమ్మలపెంట క్రాస్ రోడ్డులో భూమి పూజ చేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుతం పీహెచ్‌సీ నిర్వహిస్తున్న అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య కొనసాగుతోంది. ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉండగా ఒక డాక్టర్ పెద్దయమ్మనూరుకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఉన్న ఒక్క వైద్యుడు కొన్ని సమయాల్లో 104 వాహనం ద్వారా గ్రామాల్లో వైద్యసేవలందించేందుకు వెళితే డాక్టర్లు లేక పీహెచ్‌సీ వెలవెలబోతోంది. ఫర్నీచర్ సరిగా లేకపోవడంతో ఇటీవల కొందరు దాతలు అందించారు.

పనిచేయని సీబీపీ పరికరం



నిరుపయోగంగా సీబీపీ పరికరం

అవుకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 8 మంది డాక్టర్లు ఉండాల్సి ఉండగా మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జనరల్ మెడిషన్, గైనకాలజిస్ట్ డాక్టర్లు కొన్ని రోజుల నుంచి విధులకు హాజరు కావడంలేదు. మత్తుమందు డాక్టర్ డిప్యూటేషన్‌పై డోన్ సీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు జీడీఏ, ఒక ఫార్మసిస్ట్, ఒక జూనియర్ అసిస్టెంట్, పోస్టుమార్టం అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ల్యాబ్‌కు సంబంధించి సీబీపీ(కంప్లీట్ బ్లడ్ పిక్చర్) పరికరం అందుబాటులో ఉన్నా పరీక్ష చేసేందుకు కావాల్సిన కెమికల్స్ లేకపోవడంతో రోగుల శ్యాంపిల్స్ తీసి ఇదే మండలంలోని ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి పంపి సీబీపీ పరీక్షలు నిర్వహించాల్సి వస్తోంది. ఐదు నిమిషాల్లో రిపోర్టు రావాల్సి ఉండగా పరికరం పనిచేయకపోవడంతో రిపోర్టు కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు.

ఎక్సరే పరికరం ఏర్పాటు చేయాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా మార్పుచేశారు. నాడు– నేడు కార్యక్రమం ద్వారా ఆసుపత్రి రూపురేఖలు మారిపోయాయి. డాక్టర్లు, వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నా ఎక్సరే పరికరం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం వెళ్లిన రోగులకు ఎక్సరే అవసరమైతే ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సి వస్తోంది. ఎక్సరే ఏర్పాటు చేసి రోగుల కష్టాలు తీర్చాలి.

–జగన్‌మోహన్‌రెడ్డి, కోవెలకుంట్ల

పీహెచ్‌సీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీ భవనానికి నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు ప్రభుత్వ భవనం అందుబాటులోకి రాకపోవడంతో అరకొర వసతులున్న అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన భవనాన్ని పూర్తి చేయాలి.

–నాగరాజు, అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల

వేలంలో రూ.42.12 లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

బనగానపల్లె: బనగానపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో వివిధ హక్కులకు గురువారం నిర్వహించిన వేలం పాటలో రూ.42.12 లక్షల ఆదాయం లభించింది. ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ సతీష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో దిన, వారపు మార్కెట్, వాహనాల స్టాండ్, జంతువధశాలకు వేలం నిర్వహించారు. దిన, వారపు మార్కెట్‌కు 20.12 లక్షలు, వాహనాల స్టాండ్ రూ.20 లక్షలు, జంతు వధశాల ద్వారా రూ.2 లక్షలు లభించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. గత ఏడాది కన్నా రూ.6.04 లక్షలు అదనంగా ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. సర్పంచ్ ఈసారి ఎల్లమ్మ, ఉపసర్పంచ్ బురానుద్దీన్, పలుకూరు పంచాయతీ ఈఓ బాలాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలి



ఊటకొండలో ఆందోళన చేస్తున్న రైతులు

ప్యాపిలి: వేసవిలో పశువులు నీటి కోసం ఇబ్బందులు పడకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలని ఊటకొండ గ్రామంలో రైతులు రాందాస్, రాంపుల్లయ్య, కిరణ్ గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. అడవికి మేతకు వెళ్లే పశువులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. వేసవి కారణంగా నీటి కుంటలు ఎండిపోవడంతో పశువులు దాహంతో అల్లాడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నీటి తొట్టెలు ఏర్పాటు చేసి నీటిని నింపాలన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న ఏడీ

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో జరుగుతున్న ప్రాక్టికల్ సప్లిమెంటరీ పరీక్షలను గురువారం రాష్ట్ర ఉపాధి కల్పన శిక్షణా సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ సోలోమెన్ తనిఖీ చేశారు. 2019–21 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫెయిల్ అయిన విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. ఇందులో ఎలక్ట్రీషియన్ 11 మంది విద్యార్థులు, ఫిట్టర్ ఇద్దరు, సివిల్ ఇద్దరు, మెకానికల్ ట్రేడ్‌లలో ఒక్కరు చొప్పున మొత్తం 16 మంది పరీక్షలకు హాజరయ్యారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సారా, బైక్

బనగానపల్లె రూరల్: బనగానపల్లె ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని పలు గ్రామాల్లో సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ వర్ధనాదేవి గురువారం తెలిపారు. కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె గ్రామానికి చెందిన రాముడు నుంచి 40 లీటర్ల నాటుసారా, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే అవుకు మండలం కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన హనుమంత్‌నాయక్‌ను అరెస్ట్ చేశామన్నారు. కొలిమిగుండ్ల గ్రామంలో చీకటి ఉషాకుమార్ నుంచి 30 లీటర్ల సారా, బనగానపల్లె మండలం ఇల్లూరుకొత్తపేట గ్రామానికి చెందిన వెంకటలచ్చమ్మ నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌దాస్, ఎస్‌ఐలు రమేష్, కమలాకర్ ఉన్నారు.

సారా విక్రేతల అరెస్ట్



నాటు సారాను చూపుతున్న సీఐ

డోన్ రూరల్: నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఆ శాఖ కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. ప్యాపిలి మండలం రాచర్ల, అలేబాద్‌తండా గ్రామాల్లో దాడులు నిర్వహించామన్నారు. రాచెర్ల గ్రామానికి చెందిన గోసానిపల్లి వెంకటేష్, అలేబాద్‌తండా గ్రామానికి చెందిన ముదావత్ మేనేజ్‌నాయక్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 90 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు. ఎస్‌ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్ ఉన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

డోన్ టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. స్థానిక గుత్తి రోడ్డులోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న అటవీశాఖ భూమిలో గురువారం మొక్కలు నాటారు. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించేందుకు ద్రోణాచార్య పేరుతో ఇక్కడ నగర వనం ఏర్పాటు చేస్తామన్నారు. వాకింగ్ ట్రాక్, హిల్ ట్రెక్కింగ్ మార్గం, జింకల పార్క్, యోగా కేంద్రం, సైక్లింగ్ ట్రాక్, మినీ జూపార్క్, జిమ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డీఎఫ్‌ఓ నాగమహేశ్వరి, సబ్ డీఎఫ్‌ఓ సూర్యచంద్రరాజు, డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

30 నుంచి బీరప్ప మల్లికార్జునస్వామి ఉత్సవాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామస్తుల ఆరాధ్య దైవం బీరప్ప మల్లికార్జున స్వామి ఉత్సవాలు ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. 31వ తేదీ ఉదయం స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహిస్తామన్నారు.. ఏప్రిల్ 1వ తేదీ తెల్లవారుజామున రాత్రి డోలు వాయిద్యాలు, గురువయ్యల నాట్యాల మధ్య కలశ పూజ నిర్వహించి స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించనున్నట్లు వెల్లడించారు.

చీరల పంపిణీ

డోన్: రంజాన్‌ను పురస్కరించుకుని స్థానిక నల్లగుట్ట ప్రాంతానికి చెందిన 10 మంది పేద ముస్లిం మహిళలకు గురువారం చీరలు పంపిణీ చేసినట్లు ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ తెలిపారు. ప్యాపిలి మండలం బావిపల్లెకు చెందిన రెడ్డి జనార్దన్ ఆర్థిక సహాయంతో వీటిని అందజేసినట్లు చెప్పారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడి మృతి

బనగానపల్లె రూరల్: ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య వివరాల మేరకు.. మండలంలోని నందివర్గం గ్రామానికి చెందిన కోటదస్తగిరి(70) కడుపు నొప్పి భరించలేక బుధవారం రాత్రి గుళికల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు నంద్యాల శాంతిరామ్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. మృతుడి కోడలు కోటరాజ్యలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్ జాబితా విడుదల

బనగానపల్లె రూరల్: మెగా డీఎస్సీ ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల రెండో జాబితా విడుదలైనట్లు బనగానపల్లె సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి చిన్న రాముడు గురువారం తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను https://mdfc.apcfss.in వెబ్‌సైట్‌లో ఉంచినట్లు చెప్పారు. శిక్షణ సంస్థలను కూడా అదే వెబ్‌సైట్‌లో ఈ నెల 28వ తేదీలోపు ఎంపిక చేసుకోవాలన్నారు.

ఇద్దరిపై దాడి కేసు

బేతంచెర్ల: విద్యుత్ బల్బులు ఏర్పాటు చేసే విషయంలో మండల పరిధిలోని మండ్లవానిపల్లె గ్రామానికి చెందిన మండ్ల బాలన్న అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన గాజ జనార్దన్, గోపాల్ దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చెన్నయ్య తెలిపారు.

రేపు కబడ్డీ పోటీలు

డోన్ రూరల్: ఉగాదిని పురస్కరించుకుని మండల పరిధిలోని వలసల గ్రామంలో శనివారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు పోటీలు జరుగుతాయన్నారు. విజేత జట్లకు వరుసగా రూ.20,016, 15,016, 10,016, 6,016, 4,016, 3,016 నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులకు భోజన వసతి ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ ఖద్ర్



విద్యుత్ దీపాల అలంకరణలో గంజిఖాన మసీదు

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముస్లింలు గురువారం షబ్ ఏ ఖద్ర్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రంజాన్ పవిత్ర మాసంలో వచ్చే 27వ తేదీ రాత్రి షబ్ ఏ ఖద్ర్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ రాత్రే పవిత్ర ఖురాన్ గ్రంథం అవతరించిందని ముస్లింలు నమ్ముతారు. గురువారం రాత్రి పట్టణంలోని నాలుగు మసీదులతో పాటు జలదుర్గం, రాచర్ల, ఏనుగుమర్రి, మెట్టుపల్లి, పోతుదొడ్డి, కొమ్మేమర్రి తదితర గ్రామాల్లోని మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాత్రంతా ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పారాయణం చేస్తూ జాగరణ చేశారు.



డీలర్ కోసం ఎదురు చూస్తున్న కార్డుదారులు

ఈకేవైసీ పాట్లు

డోన్ టౌన్: రేషన్‌కార్డుదారులు ఈ నెల 31వ తేదీ లోపు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని.. లేకుంటే ఏప్రిల్ 1వ తేదీ నుంచి రేషన్ బంద్ అవుతుందన్న ప్రభుత్వ ప్రకటన పేదల్లో గుబులురేపుతోంది. ఉగాది, రంజాన్ పండుగలు దగ్గర పడడంతో పనులు మానుకొని ఈకేవైసీ కోసం పరుగులు తీస్తున్నారు. రేషన్‌డీలర్లు, సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. అయితే ఈకేవైసీ ప్రక్రియ మొదలు పెట్టకపోవడంతో కార్డుదారుల్లో ఆందోళన మొదలైంది. గురువారం పట్టణంలోని పలు రేషన్ షాపుల వద్ద ప్రజలు పడిగాపులు కాస్తున్న దృశ్యాలు కనిపించాయి.

పాస్టర్ మృతికి సంతాపం



డోన్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు

డోన్ టౌన్: తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ డోన్‌లో క్రైస్తవులు, పాస్టర్లు, వామపక్ష నాయకులు గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద ప్రార్థనలు చేశారు. ప్రవీణ్ మృతిపై విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు ఆనందరావు, శామ్యూల్, సాగర్, ఉదయ్‌కుమార్, బెన్నీ, సుంకయ్య, నాగరాజు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పేద ఆర్యవైశ్యులకు కిట్లు పంపిణీ



ఉగాది కానుక అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

బేతంచెర్ల: ఉగాదిని పురస్కరించుకుని స్థానిక అమ్మవారిశాలలో పట్టణంలోని పేద ఆర్యవైశ్యులకు నిత్యావసర కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు కందగడ్డల జనార్దన్, గుండా గోపాలు అందజేశారు. నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగ మహేష్ ఆర్థిక సహకారంతో ఉగాది కానుకను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు విష్ణు, సుధీర్, సతీష్, మధు సురేంద్ర, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం పాట

బేతంచెర్ల: నగర పంచాయతీలో దిన, వారపు సంతమార్కెట్, బండ్లమెట్ట, కమేళా వసూలుకు సంబంధించి ఈనెల 29న బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు. వివరాలకు నగర పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.